

అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 320 ఎడిటర్: కె.యువరాజ్ ఆదివారం 30-8-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు




## సురేఖ ఇంటికే!

**- 3న అధిష్ఠానంతో సీఎం, డిప్యూటీ, పీసీసీ చీఫ్ భేటీ - మంత్రివర్గం, పార్టీ వ్యవహారాలపైనా చర్చించే చాన్స్ - 1న విదేశీ పర్యటన నుంచి రానున్న కేసీ వేణుగోపాల్ - కష్టపడి అధికారంలోకి తెచ్చి.. పదవులిచ్చి గౌరవిస్తే - ఇంట్లో ఉన్న పిల్లలతో ఇష్టం వచ్చినట్లు తిట్టిస్తారా? - తిట్టిస్తే ఊరుకుంటామా.. అంటూ కఠిన వైఖరి**

**హైదరాబాద్, ఆగస్టు 29 (వన్‌నేషన్):** తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ వేడి మరింత పెరుగుతోంది. ఓవైపు మంత్రి కొండా సురేఖ వ్యవహారం క్రమశిక్షణ కమిటీ నుంచి ఏఐసీసీ వద్దకు చేరి ఉత్కంఠ రేపుతుండగా, మరోవైపు పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబరు 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఢిల్లీకి రావాల్సిందిగా అధిష్ఠానం కోరినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విదేశీ పర్యటనలో ఉన్న ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ సెప్టెంబరు 1న ఢిల్లీకి తిరిగి రానున్నట్లు, అనంతరం ఈ వ్యవహారాలపై దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. మూడో తేదీన జరగనున్న

2లో



## గిరిపుత్రుల ఆరోగ్యానికి 'సంజీవని'

**- గిరిజన ప్రాంతాల్లో విద్య, తాగునీరు, రోడ్లు - మహిళలు, గ్రామస్థులతో ముఖాముఖి - 20 ఆరోగ్య రథాలు ప్రారంభం - నేడు శ్రీకాళహస్తి, అనంతకు చంద్రబాబు - 'బాల స్వాస్థ'.. భేష్!.. 441 మంది పిల్లలకు చికిత్స**

**అరకులోయ, ఆగస్టు 29 (వన్‌నేషన్):** ఆధునిక సాంకేతికతను ఉపయోగించి మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో 'సంజీవని' ప్రాజెక్టును చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆయన ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు. ఈ ప్రాజెక్టును తొలుత చిత్తూరు జిల్లాలో అమలు చేశామని, ఇప్పుడిక్కడ ప్రారంభించామని, రానున్న 3 నెలల్లో జిల్లాలోని అన్ని ఆస్పత్రులకూ అనుసంధానిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భరోసా, ప్రతి తల్లికీ ధైర్యం, ప్రతి బిడ్డకూ ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను అందించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. 'అల్లూరి జిల్లా చరిత్రలోనే ఈరోజు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ప్రకృతి సంపద, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని మరింత చేరువ చేయడమే సంజీవని లక్ష్యం. ఇది ప్రాజెక్టు మాత్రమే కాదు.. గిరిజనుల ఆరోగ్య రక్షణకు భరోసా. ఏఐ, డ్రోన్‌లతో వైద్య సేవలు అందిస్తాం. అలాగే గిరిజన ప్రాంతాల్లో విద్య, తాగునీరు,

3లో



## మధ్య ఆసియాపై ఫోకస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 29 (వన్‌నేషన్):** మధ్య ఆసియాలో భారత్ వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగు రోజుల పర్యటనకు శనివారం శ్రీకారం చుట్టనున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లలో ఆయన పర్యటించనున్నారు. తొలుత తాష్కెంట్ చేరుకోనున్న మోదీ.. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్‌తో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించనున్నారు. అనంతరం బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) 26వ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. మోదీ ఉజ్బెకిస్థాన్‌లో పర్యటించడమిది నాలుగోసారి. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగనున్నాయి. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ అనుసంధానం, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలపై ఇరుదేశాల నేతలు సమీక్షించనున్నారు. భారత్ 'వికసిత్ భారత్ 2047', ఉజ్బెకిస్థాన్ 'ఉజ్బెకిస్థాన్-2030' అభివృద్ధి లక్ష్యాల మధ్య సహకారానికి ఉన్న అవకాశాలపైనా చర్చించనున్నారు. కాగా.. మధ్య ఆసియాలో భారత్‌కు ఉజ్బెకిస్థాన్ కీలక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. వాణిజ్యం, ఇంధనం, ఆరోగ్యం, ఔషధాలు, వ్యవసాయం, రసాయనాలు, యంత్ర పరికరాలు తదితర రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆ దేశ అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా తాష్కెంట్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి స్మారకాన్ని, మహాత్మా గాంధీ కేంద్రాన్ని మోదీ సందర్శించనున్నారు. ఆ తర్వాత కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు వెళ్లనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1న జరిగే ఎస్‌సీఓ సదస్సులో ఆయన ప్రసంగించనున్నారు.




## 'రంగారెడ్డి' రికార్డు!

**రూ.35వేల కోట్లతో దేశంలోనే - 4వ స్థానంలో నిలిచిన జిల్లా - టాప్-8లో మేడ్చల్, హైదరాబాద్ - ఆర్బీఐ నివేదికలో వెల్లడి - డిజిటల్ పేమెంట్లలో 'రంగారెడ్డి' రికార్డు! - రూ.35వేల కోట్లతో దేశంలోనే - 4వ స్థానంలో నిలిచిన జిల్లా - టాప్-8లో మేడ్చల్, హైదరాబాద్‌కు చోటు - ఆర్బీఐ నివేదికలో వెల్లడి**

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 29 (వన్‌నేషన్):** రాష్ట్ర జీడీపీలో కీలక పాత్ర పోషిస్తున్న రంగారెడ్డి జిల్లా, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోనూ తన సత్తా చాటుతోంది. ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్ రంగాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న ఈ జిల్లాలో డిజిటల్ లావాదేవీలు విపరీతంగా పెరిగాయి. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం, గత జూలై నెలలో జరిగిన యూపీఐ లావాదేవీల్లో రంగారెడ్డి జిల్లా రూ.35,118.87 కోట్ల వ్యాపారంతో దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో కర్ణాటకలోని బెంగుళూరు అర్బన్ జిల్లా రూ.96,153.36 కోట్ల లావాదేవీలతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, మహారాష్ట్రలోని ముంబై సబ్‌అర్బన్ (రూ.61,755.96 కోట్లు), పుణె (రూ.51,264.87 కోట్లు) జిల్లాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. రంగారెడ్డి జిల్లా తర్వాతి స్థానాల్లో చెన్నై (రూ.31.849.98 కోట్లు), మేడ్చల్-మల్కాజ్‌గిరి (రూ.31,747.90 కోట్లు), థానే (రూ.29,825 కోట్లు), హైదరాబాద్ (రూ. 24,939 కోట్లు) జిల్లాలు ఉన్నాయి. ప్రముఖ డిజిటల్ పేమెంట్ యాప్ 'ఫోన్‌పే' వినియోగంలోనూ రంగారెడ్డి ముందంజలో ఉంది. గత త్రైమాసికంలో ఒక్క ఫోన్‌పే ద్వారానే ఏకంగా రూ.1.04 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిపి దేశంలోనే మూడోస్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా?



బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

# నందమూరి హరికృష్ణ వర్ధంతి

## టిడిపి శ్రేణులు ఘన నివాళి

**కూకట్‌పల్లి ప్రతినిధి, ఆగస్టు 29 (వన్‌నేషన్):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో దివంగత నేత, మాజీ మంత్రి స్వర్గీయ నందమూరి హరికృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి హరికృష్ణ చిత్రపటానికి పూలమాలను అలంకరించి ఆయన సేవలను స్మరించుకుంటూ సంతాప సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అజ్మీర రాజు నాయక్, కట్ట వెంకటేష్ గౌడ్, సంధ్య పోగు రాజశేఖర, సుభాషిని, స్వాతి, జగదీష్, అవ్వారు మోహన్, రమేష్ లతోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ ప్రజా జీవితంలో చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగుదేశం కూకట్పల్లి నియోజకవర్గ నాయకులు వెజశీడ్ల కిషోర్ బాబు పిలుపునిచ్చారు.



# కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా దివ్యాంగుల “సమర శంఖారావం

**ఎల్బినగర్ ప్రతినిధి, ఆగస్టు 29 (వన్ నేషన్):** ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, దివ్యాంగుల హక్కుల సాధన కోసం “సమర శంఖారావం” సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస యాదవ్ , సబితా ఇంద్రా రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి హాజరై కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు దివ్యాంగుల సంఘాల నాయకులు పాల్గొని తమ హక్కుల కోసం గళమెత్తారు.



### దివ్యాంగులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం...

ఎన్నికల ముందు దివ్యాంగులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా దివ్యాంగులను మోసం చేసింది. రూ.6,000 దివ్యాంగుల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఆ హామీని ఎందుకు అమలు చేయడం లేదు? అని నాయకులు ప్రశ్నించారు. కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. రూ.500గా ఉన్న దివ్యాంగుల పెన్షన్‌ను రూ.4,016కు పెంచింది. దివ్యాంగుల రిజర్వేషన్లను పెంచింది. దివ్యాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేసి, వారి సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం హామీలు ఇవ్వడంలో ముందుండి, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. రాష్ట్రంలోని 5 లక్షలకుపైగా ఉన్న దివ్యాంగులకు పెన్షన్ బకాయిలు పేరుకుపోయినా, వాటిని చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని నాయకులు మండిపడ్డారు. దివ్యాంగులకు రావాల్సిన పెన్షన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీద్దాం! దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. పెన్షన్ బకాయిలను తక్షణమే చెల్లించాలి. రూ.6,000 దివ్యాంగుల పెన్షన్ హామీని నెరవేర్చాలి. దివ్యాంగుల హక్కులను, ఆత్మగౌరవాన్ని కాపాడాలి. దివ్యాంగుల హక్కుల సాధన కోసం పోరాటం ఆగదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు, దివ్యాంగులకు న్యాయం జరిగే వరకు ఈ సమర శంఖారావం కొనసాగుతూనే ఉంటుంది అని నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.

# రోమిక్ హౌస్ ఆఫ్ ఫ్లేవర్స్ ప్రారంభోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30 (వన్ నేషన్):** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మరిన్ని రుచుల విందును అందించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన“రోమిక్--హౌస్ ఆఫ్ ఫ్లేవర్స్”రెస్టారెంట్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు ఘనంగా ప్రారంభించారు. ఉప్పల్ మెయిన్ రోడ్డులోని అరేనా ఎన్.ఎస్.ఎల్ అరేనా ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్‌లో బిర్యానీ, చైనీస్, ఇండియన్, తందూరి తదితర విభిన్న రుచులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నిర్వాహకులు అలకంటి శ్రీనివాస్,రవికుమార్లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో రెస్టారెంట్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోల్లురి అంజయ్య బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# తెలుగు భాషా వికాసానికి సాంకేతికత తోడవ్వాలి

**- భాషా వ్యాప్తికి తెలుగు వర్సిటీ కృషి అభినందనీయం. - మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారానికి టీవీ శ్రీనివాస్ అర్హులు.. పురస్కార ప్రదానోత్సవంలో త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి.**



**హైదరాబాద్, ఆగస్టు 29 (వన్ నేషన్):** తెలుగు భాషా వికాసానికి సాంకేతికత తోడవ్వాలని, అలాగే స్వచ్ఛమైన తెలుగును కాపాడుకోవడం మనందరి బాధ్యత అని త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి సూచించారు. నాంపల్లిలోని ఆడిటోరియంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించిన మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కార ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర అసోసియేషన్, పూణె సలహాదారు టి.వి. శ్రీనివాస్ కు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తొలుత అందరికీ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు తనకు అసెంబ్లీలో పరిచయమని, ఎవరి గురించైనా ఎదుటి వాళ్ల చెప్పినప్పుడు చాలా గొప్పగా ఉంటుందని, అటువంటి వంటి వ్యక్తి వెంకట కృష్ణారావు అన్నారు.

### వర్సిటీ ప్రత్యేక కార్యక్రమాలు అభినందనీయం

తెలుగు యూనివర్సిటీ, తెలుగు భాష విషయంలో వర్సిటీ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకర మన్నారు. కేవలం భాష మాత్రమే కాకుండా, సంస్కృతీ సంప్రదాయాలు, నృత్యాలు, డప్పుల కార్యక్రమాలతో మిగతా వర్సిటీల కన్నా ప్రత్యేకత చాటుతోందని కొనియాడారు. గతంలో ఉన్న గవర్నర్ నార్త్ ఈస్ట్ లో ఉన్న కల్చరల్ అసోసియేషన్లను తీసుకొచ్చి ఇక్కడ వాటి ఎదుగుదలకు కృషి చేశారని గుర్తు చేశారు. మిగతా దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాల్లో కూడా తెలుగు భాష వ్యాప్తికి కృషి వర్సిటీ కృషి అభినందనీయమని తెలిపారు. అలాగే టి.వి. శ్రీనివాస్ కు ఈ పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అయితే సాంకేతికత వినియోగంలో తెలుగు యూనివర్సిటీ ఇంకా సాధించాల్సిన అవసరం ఉందని ఇంద్రసేనా రెడ్డి సూచించారు. తరగతి భోదన బట్టీపట్టే పద్ధతిలో కాకుండా, అనుభవ పూర్వకంగా ఉండాలన్నారు. ఆ దిశగా వర్సిటీ ఆలోచించాలని అన్నారు.

### ఇంగ్లీష్ పదాలు లేని తెలుగుపై పోటీలు

శ్రీనివాస్ మాటల్లో సిగ్గు, బిడియం వంటి పదాలు ఉన్నాయని, వాస్తవానికి అవన్నీతనకు వర్తిస్తాయని చమత్కరించారు. వారంతా స్పష్టంగా తాను తెలుగులో మాట్లాడలేనని అన్నారు. మొత్తంగా ఆయన ప్రసంగంలో కేవలం 3 పదాలు మాత్రమే ఇంగ్లిషువి ఉన్నాయన్నారు. అది నిజంగా గొప్ప విషయమన్నారు. ఆ రకంగా మాట్లాడాలని పోటీలు కూడా పెట్టాలని సూచించారు. వేరే భాషా పదాలు రాకుండా కొన్ని నిమిషాలు మాట్లాడాలని పోటీలు పెట్టడం వల్ల చాలా లాభం ఉంటుందని పేర్కొన్నారు. ఇంత స్వచ్ఛంగా తెలుగు భాష మాట్లాడతారు కాబట్టే శ్రీనివాస్ ఈ పురస్కారానికి అర్హులు అన్నారు. తనకు భాష మీద ప్రత్యేక అభిమానం ఉన్నప్పటికీ, సబ్జెక్ట్ దగ్గరకు వచ్చేసరికి మిగతా పదాలన్నీ వస్తాయని అన్నారు.

### తెలుగుకు తగ్గిన ప్రాముఖ్యత

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భాష సంయుక్త రాష్ట్రాలు ఏర్పడితే, అందరూ ఒక్కటిగా ఉంటారని ఆలోచన ఉండేదని, కానీ కొన్ని భాషలను ఆయా రాష్ట్రాలు బలవంతంగా కిల్ చేశాయని తెలిపారు. ఉదాహరణకు ఇక్కడి నుంచి సూరత్, బొంబాయి, పుణా వెళ్లిన వాళ్లు అక్కడ తెలుగు పాఠశాలలు పెట్టుకున్నారని, అలాగే బయట నుంచి వచ్చిన వాళ్లు ఇక్కడ ఆయా భాషల పాఠశాలలు పెట్టుకున్నారని తెలిపారు. శనివారం అక్కడున్న స్కూళ్లలో తప్పనిసరిగా లోకల్ భాష నేర్చుకోవాలన్నా ఆంక్షలతో తెలుగుకు ప్రాముఖ్యత తగ్గిందన్నారు. ఒకప్పుడు మా భాష ఉండాలి, మా భాష సంస్కృతి ఉండాలనే ఆలోచన ఉండేదని, ఇప్పుడు అటువంటి ఆలోచన లేదన్నారు.

### ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం అవసరం

విద్యార్థులకు ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, కేస్ స్టడీస్, ఇండస్ట్రీ ఇంటనెన్సిప్, నూతన విద్యాబోధనలు వంటి నూతన పోకడలను తెలుగు వర్సిటీ అనుకరించాలని సూచించారు. విద్య అంటే సాధారణ డిగ్రీలా కాకుండా, అనుభవ పూర్వకంగా ఉండాలనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చిందన్నారు. డిజిటల్ విద్య అవసరం అని గుర్తించాలన్నారు. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చెబితే అది 100 శాతం కరెక్ట్ అనే ఆలోచన తప్పు అన్నారు. కొన్ని సార్లు సంతకం రాని వారికి కూడా డాక్టరేట్ ఇస్తామని, అది ఆయనకు ఉన్న ప్రత్యేకమైన క్వాలిటీకి లభించిన గుర్తింపు అన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చాక పద్మశ్రీ వంటి బిరుదుల కేటాయింపులో కూడా ప్రత్యేక గుర్తింపు ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

పురస్కార గ్రహీత శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి తరానికి, రాబోయే తరానికి తెలుగు భాషా సంస్కృతులను, వాటి మహోన్నత వైభవాన్ని పరిచయం చేస్తున్న సురవరం తెలుగు విశ్వవిద్యాలయానికి అభినందనలు తెలిపారు. తనను పురస్కారానికి ఎంపిక చేసినందుకు అభివాదాలు అన్నారు. తనను తెలుగు మాధ్యమంలోనే చదివించిన తల్లిదండ్రులకు, నాన్నమ్మ రుణం తీర్చుకోలేనన్నారు. తమ ఇంట్లో ఎప్పుడూ చక్కటి తెలుగు వాతావరణం ఉండేదని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానంద రావు వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ఏపీ శాసనసభ్యులు డా. మండలి బుద్ధప్రసాద్, తెలంగాణ ప్రభుత్వం పూర్వ సలహాదారులు డా. కె.వి. రమణాచారి పాల్గొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు స్వాగతోపాన్యాసం చేశారు. డైరెక్టర్ ఆచార్య బి. హెచ్. పద్మప్రియ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# సురేఖ ఇంటికే!..

(1వ పేజీ తరువాయి)

చర్చల్లో కొండా సురేఖ వ్యవహారంతోపాటు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కూడా కీలక నిర్ణయాల దిశగా కసరత్తు జరగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొండా సురేఖ వివాదానికి సంబంధించి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నివేదిక ఇప్పటికే ఏఐసీసీకి చేరింది. దీనిపై అదిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయినా.. సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్‌ను ఢిల్లీకి పిలిపిస్తుండడంతో కేవలం కొండా సురేఖపై చర్యల విషయంలో నిర్ణయం తీసుకోవడానికేనా? లేక మొత్తంగా మంత్రివర్గంలో మార్పులు, పార్టీ వ్యవహారాలపై సమగ్ర చర్చ కోసమా? అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. కొండా సురేఖపై కఠిన నిర్ణయం తీసుకుని, మంత్రివర్గం నుంచి ఆమెను తప్పిస్తే.. ఖాళీ అయ్యే స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలన్నది కూడా ఢిల్లీలో చర్చకు వచ్చే అవకాశం ఉందంటున్నారు. పునర్వ్యవస్థీకరణలో భాగంగా టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న ప్రతిపాదనలు గతం నుంచే వినిపిస్తున్నాయి. అయితే మహేశ్‌గౌడ్‌కు మంత్రి పదవి ఇస్తే.. పీసీసీ అధ్యక్ష పదవి ఎవరికి అనే చర్చ కూడా పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఎస్టీ, బీసీల్లో ఒకరికి ఈ పదవి దక్కవచ్చని, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌ల పేర్లు చర్చల్లో ఉన్నాయని సమాచారం.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాకే ఎల్బీనగర్ నియోజకవర్గం అధిక నిధులు మంజూరు : మధుయాష్కి గౌడ్



**ఎల్బీనగర్ ప్రతినిధి, ఆగస్టు 29 (వన్ నేషన్):** చంపాపేట డివిజన్ మారుతి నగర్ లో రూ. 1.44 కోట్లతో చేపటనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు మల్ రెడ్డి రాంరెడ్డి, మిద్దెల జితేందర్ తో కలిసి శంకుస్థాపన. సీఎం రేవంత్ రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గానికి అత్యధిక నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి పనులకు ప్రత్యేక సహకారం అందిస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. చంపాపేట డివిజన్లోని మారుతీ నగర్ కాలనీలో లో రూ. 1.44 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, సేవ దళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ తో కలిసి మధుయాష్కి గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. అభివృద్ధి కోసమని పార్టీ మారిన ఇక్కడి ఎమ్మెల్యే, ఏ అభివృద్ధి చేయకుండా ప్రజలను మోసం చేశాడని, సూర్యుడి కంటే ముందే లేస్తా అని డైలాగులు మాత్రమే చెప్పుకుంటున్నాడని విమర్శించారు. మూసీ కార్పొరేషన్ చైర్మన్ పదవి పొందాడే తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. రాజకీయాలకతీతంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే నియోజకవర్గానికి నిధులు మంజూరయ్యాయని బిజెపి మాజీ కార్పొరేటర్లు సైతం పలు వేదికలపై మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు స్పందించి పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ప్రజలు కట్టిన పన్నులను కాళేశ్వరానికి తరలించి కమీషన్లు దండుకొని తిన్నారని, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం నగరంలో వసూలు చేసే పన్నులను ఇక్కడి అభివృద్ధి కే ఖర్చు చేస్తున్నారన్నారు. నగరంలో మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు కల్పించేలా కృషి చేస్తున్నామన్నారు. చంపాపేట డివిజన్లో గతంలో వరద ముంపు సమస్యలు ఉంటే, తాము రూ. 5కోట్ల నిధులతో పనులు చేయించి సమస్య తీర్చామన్నారు. డ్రైనేజీ సమస్యలను కూడా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపీగా ఈటల రాజేందర్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు తీసుకొచ్చారు..? అని ప్రశ్నించారు. ఇక్కడి ఎమ్మెల్యే 118 జీవో ద్వారా కన్వీనెంట్ డేట్ తీసుకొచ్చి ప్రజలకు బురిడీ కొట్టించాడన్నారు. మునుగోడు ఉప ఎన్నికను పురస్కరించుకొని హడావుడిగా 118 జీఓ తీసుకొచ్చి.. ప్రజలు కష్టపడి కొనుక్కున్న ఇళ్లలో ప్రజలే కబ్జాదారులని కన్వీనియన్స్ డీడ్ లలో చూపించారని, ప్రజలతో పైసలు కట్టించి కన్వీనియన్స్ డీడ్ పేరిట చిత్తుకాగితాన్ని అందజేశారని విమర్శించారు.

ఎస్.ఐ.ఆర్ ఫేజ్ -2లో ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దని.. 1,87,000 ఓట్లు నో మ్యాపింగ్ లో ఉన్నాయని, నోటీసులు అందుకునే అందరూ సరైన వివరాలు అందించి ఓట్లు నమోదు చేసుకోగలరని సూచించారు. మల్రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత మధుయాష్కి గౌడ్ సహకారంతో వివిధ నియోజకవర్గంలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఎల్బీనగర్ అంటే సీఎం రేవంత్ రెడ్డి కి ప్రత్యేక అభిమానమన్నారు. గత ప్రభుత్వంలో 100 కోట్ల నిధులు కూడా నియోజకవర్గానికి రాలేదని.. అభివృద్ధి పేరిట ఇక్కడి ఎమ్మెల్యే డ్రామాలు ఆడుతుంటాడని విమర్శించారు. మేము మంత్రిగారికి రోడ్లు, అభివృద్ధి విషయాలు చెప్పగానే.. ఎమ్మెల్యే వాటిపై మాట్లాడుతూ. తానే చేస్తున్నట్లు డ్రామాలు చేస్తుంటారని విమర్శించారు.

ఈ సందర్భంగా మధుయాష్కి దుర్గాభవాని నగర్ లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అధ్వానంగా మారిన క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. కబ్జాదారుల నుంచి ఇటీవల హైడ్రా కాపాడిన పార్కు స్థలాన్ని పరిశీలించారు. కాలనీవాసుల విన్నపం మేరకు పార్కుగా అభివృద్ధి చేస్తామని వివరించారు. పార్క్ స్థలాన్ని కాపాడిన హైడ్రాను అభినందించారు. ఎస్సీ బస్తీ లోని నవజీవన్ జ్యోతి సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పరిశీలించారు.

కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్ రెడ్డి , సామ రమణారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల రవీందర్ గౌడ్, మాజీ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెగావత్ గణేష్ నాయక్, నాయకులు కారుకొండ శివ, తోకటి కిరణ్, దుర్గా రెడ్డి, బండ సురేందర్ , జిల్లా స్పోక్స్ పర్సన్ దాము మహేందర్ యాదవ్, జిల్లా కార్యదర్శి జక్కా సందీప్, నాయకులు సాయి నికేష్, అనసూయ, సరిత, యాదమ్మ, వరలక్ష్మి, భాగ్య, మాధవి, కాలనీ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి , రఘునందన్ రెడ్డి , లలిత తదితరులు పాల్గొన్నారు.

# గిరిపుత్రుల ఆరోగ్యానికి 'సంజీవని'

**(1వ పేజీ తరువాయి)**

రోడ్లు, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, ఉపాధి, సంక్షేమ రంగాలను నిరంతరం అభివృద్ధి పథంలో నడిపిస్తాం' అని తెలిపారు. రాష్ట్రాన్ని గత పాలకులు ధ్వంసం చేశారని.. వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారని విమర్శించారు.

## గ్రూప్-1 పేపర్లు అటెండర్లతో దిద్దించారు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎంగా తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపైనే పెట్టాను. 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తే, ఏడాది తర్వాత దానిపై గొడ్డలి పార్టీ రాద్ధాంతం చేస్తోంది. ఇప్పుడు రాష్ట్రంలోని మొత్తం టీచర్ పోస్టుల్లో 80 శాతం టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు భర్తీ చేసినవే. గత పాలకులు గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడ్డారు. ఆర్టీవో స్థాయి అధికారులను ఎంపిక చేసే పరీక్ష పత్రాలను ఎలక్ట్రీషియన్లు, అటెండర్లతో దిద్దించారు. అలాగే దేవాలయాల ప్రతిష్ఠను దెబ్బతీశారు. బలవంతపు మత మార్పిడులు చేశారు. ఓ మాజీ మంత్రి కోడలు సైతం బయటకు వచ్చి ఇంట్లో జరిగిన విషయాన్ని బయటపెట్టింది. తనను బలవంతంగా మతం మార్చే ప్రయత్నం చేశారని చెప్పింది. గత పాలకులు వాళ్ల పార్టీలో ఉండాలంటే మతం మార్చుకోవాల్సిన పరిస్థితి తీసుకొచ్చారు. గొడ్డలి పార్టీతో చేతులు కలిపిన సివిల్ సర్వీస్ అధికారులు, పారిశ్రామికవేత్తలు జైలు పాలయ్యారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని ఆ పార్టీ నేత కొత్త రాగాలు తీస్తున్నారు. ఎక్కడా ఏకగ్రీవాలు జరగకూడదంటున్నారు. వారి పాలనలో మాత్రం ఏకగ్రీవాలు కావాలన్నారు. అధికారంలో ఉంటే ఒక విధంగా, విపక్షంలో ఉంటే మరో విధంగా మాట్లాడుతున్నారు. కేంద్రంలోనూ, ఏపీలోనూ ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పనిచేస్తోంది. సోమవారం వెలిగొండ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేస్తున్నాం. వచ్చే నెల రెండో తేదీన గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకొస్తున్నాం. గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆర్కే నగర్లో 30 మంది సంజీవని లబ్ధిదారుల(డిజిట్ హెల్త్ రికార్డులు కలిగినవారు)తో సీఎం సమావేశమయ్యారు. గర్భిణి దివ్యతో, మరో మహిళతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవల గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. వర్షాభావం వల్ల వరి నాట్లు వేయలేకపోయామని దొన్ను అనే రైతు చెప్పగా.. ప్రత్యామ్నాయ పంటల సాగుకు రాజ్మా, రాగులు, కందులు మొదలైన విత్తనాలు సరఫరా చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. కాఫీ తోటలు ఎంతమందికి ఉన్నాయి..

# రెండో రోజు కొనసాగిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లాటరీ

## - ఆన్ లైన్ లో ఎంపికైనవారి వివరాలు - అభ్యంతరాలు ఫిర్యాదులకు అవకాశం

**కూకట్‌పల్లి ప్రతినిధి, ఆగస్టు 29 (వన్‌నేషన్):** ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకం లాటరీ ప్రక్రియలో భాగంగా శనివారం నాడు 1920 ఇండ్లను కేటాయించారు. ఖైరతాబాద్ కూకట్ పల్లి, బహదూర్ పుర, అంబర్ పేట నియోజకవర్గాల్లో నిర్మించనున్న ఇండ్లకు సంబంధించిన లాటరీని స్థానికంగా ఆయా ప్రాంతాల్లోని వివిధ ఫంక్షన్ హాళ్లలో నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లోనూ అధికారులు, దరఖాస్తుదారుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా లాటరీ కొనసాగింది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 16 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న ఇండ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. ప్రాథమిక అర్హతల నిర్ధారణ అనంతరం అర్హులైన వారికి లాటరీ ప్రక్రియ ద్వారా ఇండ్ల కేటాయింపు జరిపారు. ఆగస్టు 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ లాటరీ ప్రక్రియను రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుక్రవారం నాడు ప్రారంభించారు. అందులో భాగంగా రెండవ రోజు కూడా లాటరీ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ప్రక్రియలో మూడవ రోజు ఆగస్టు 30వ తేదీ ఆదివారం నాడు నాడు శేరిలింగం పల్లి, మలక్ పేట, మేడ్చల్ ఇబ్రహీం పట్నం, నియోజకవర్గాలకు చెందిన లాటరీ నిర్వహిస్తారు.

### ఆన్ లైన్ లో వివరాలు-అభ్యంతరాల స్వీకరణ

ఇందిరమ్మ ఇల్లు టవర్స్ కోసం లాటరీలో ఎంపికైన వారి వివరాలు ఆన్ లైన్ లో అందుబాటులో ఉంచుతున్నామని హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ విపి గౌతమ్ తెలిపారు. లాటరీలో ఎంపికైన వారి వివరాలను అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. దరఖాస్తు స్వీకరణ సమయంలో ఎటువంటి ధ్రువపత్రాలను తీసుకోనందున, దరఖాస్తుదారులు ఇచ్చిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో నిర్ధారించుకునేందుకు ఈ పరిశీలన చేపడుతున్నామని తెలిపారు. అంతేకాకుండా లాటరీ లో ఎంపికైన వారి విషయంలో ఏమైనా అభ్యంతరాలు ఫిర్యాదులు ఉంటే తెలియజేసే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. అర్హులైన వారికే ఇండ్ల కేటాయింపు జరగాలనే లక్ష్యంతో అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో ఎటువంటి అపోహలు అనుమానాలకు తావు లేదని స్పష్టం చేశారు.

# తెలంగాణ ప్రజల బాకీ ఎప్పుడు తీరుస్తారు..!:

## మాజీ కార్పొరేటర్ బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి.



**బడంగ్పేట్ (వన్ నేషన్) :** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు తీరుస్తుందో చెప్పాలని, 'బాకీ కార్డ్' పేరుతో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీని నిలదీయాలని బడంగ్ పేట్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 100 రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసగించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికి వివరించేలా పార్టీ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని, కాంగ్రెస్ తీరును క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తూ ఎండగడతామని బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి స్పష్టం చేశారు.

# హైదరాబాద్ కవాడిగూడలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు




**హైదరాబాద్, ఆగస్టు 30 (వన్ నేషన్):** హైదరాబాద్ కవాడిగూడలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు జరిగాయి. కవాడిగూడ ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్లో గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. వ్యావహారిక భాషకు గౌరవం తీసుకురావడంలో గిడుగు చేసిన కృషి చారిత్రాత్మకమని వక్తలు కొనియాడారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే భాషలో విద్య అందించాలన్న ఆయన ఆశయాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ పి. స్వర్ణలత, మాధవి, విజయ్ కుమార్, భాస్కర్, జెసింతా, రత్నప్రభ పాల్గొన్నారు.



హైదరాబాద్, ఆగస్టు ౦29 (వన్‌నేషన్): ఈరోజు ఎస్.ఆర్. జూనియర్ కళాశాల, చంపాపేట్ విద్యార్థి ఫిర్యాదు మేరకు బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజు చెల్లించాలని చెబుతూ, విద్యార్థుల జీవితాన్ని వ్యాపారంగా మార్చుకుంటున్న ఎస్.ఆర్. జూనియర్ కళాశాల పై ధర్నా చేయడం జరిగింది. విద్యార్థికి సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.పోగాకు మల్లికార్జున్ యాదవ్ (బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి)

# 'బెయిల్' వస్తోంది



శివరాజ్‌కుమార్, సంజన ఆనంద్, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'బెయిల్'. పవన్ వడయార్ దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్నారు. సంగీత, సాయికుమార్, జయరామ్, గోపాల్ కృష్ణ దేశ్‌పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా అక్టోబరు 2న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. ఈ మేరకు "న్యాయం జరుగుతుంది" అనే క్యాప్షన్‌ను జోడించింది. "బాబీ.. పులికి వేటాడటానికి అదృష్టం అవసరం లేదు. ఎందుకంటే వేటాడటం దాని అభిరుచి కాదు. అదే దాని వృత్తి. మనుషులు కాదు వాళ్లు రాక్షసులు" లాంటి సంభాషణలతో ఆసక్తిగా సాగుతోందీ టీజర్. ఇందులో శివరాజ్‌కుమార్ పోలీసు అధికారి పాత్రలో కనిపించిన తీరు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. న్యాయపోరాటం, ప్రతీకారం, శక్తిమంతమైన అండర్‌వరల్డ్ ఘర్షణల చుట్టూ ఈ కథ తిరుగుతుందని టీజర్ స్పష్టం చేస్తుంది.

# నువ్వు లేకుండా బతకలేను



"కన్నీళ్లతో నీ వైపు కనీసం చూడలేకపోయాను. అయ్యో నువ్వు ఒంటరిగా వెళ్లిపోయావు. నా గుండె ఆగిపోతుంది" అంటూ ఓ తల్లి తన కూతుర్ని కలవాలనే ఆశతో పరితపిస్తోంది. తాప్సి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమే 'గాంధారి'. దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్నారు. సెప్టెంబరు 3న నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా 'దిల్ జానేయా' అనే పాటను విడుదల చేసింది చిత్రబృందం. "నువ్వు లేకుండా నేను బతకలేను. నీవల్లే నా హృదయం కుదుటపడింది. ఇప్పుడు నీకోసమే బాధతో కుంగిపోతుంది. నువ్వు లేకుండా ఉండటం నావల్ల కాదు, గుండె పగిలిపోతుంది" అంటూ సాగుతున్న గీతం తల్లీకూతుళ్ల మధ్య ఉన్న బంధాన్ని తెలియజేస్తుంది. కౌసర్ మునీర్ సాహిత్యమందించగా దీపాలి సహాయ్, యశ్ కపూర్ ఆలపించారు. ఈ సినిమాలో అంధురాలైన తల్లి పాత్రలో కనిపించనుంది తాప్సి. ఇష్వాక్ సింగ్, ఛాయా కదమ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# లోన్ తీసుకుని ప్రోగ్రామ్స్ చేశా.. ఆ బాధ నాకు తెలుసు



'మ్యాడ్'తో తెలుగు తెరపై మెరిసి.. ఆ తర్వాత '8 వసంతాలు' అంటూ కుర్రకారు హృదయాలను కొల్లగొట్టేశారు అనంతిక సనీల్ కుమార్. ఇప్పుడు 'రోమాంచకం'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అనంతిక తన కుటుంబం, కెరీర్‌కు సంబంధించిన కీలక విషయాలు పంచుకున్నారు.

**అందుకే ఇండస్ట్రీకి వచ్చా..**

"చిన్నప్పటి నుంచి నాకు కళలు అంటే ఇష్టం. నాట్యం నేర్చుకుంటున్నాను. ఆరో తరగతిలో ఉన్నప్పటి నుంచి ప్రోగ్రామ్స్ ఇవ్వడం మొదలుపెట్టా. ఒక ప్రోగ్రాం ఇవ్వాలంటే చాలా ఖర్చు అవుతుంది. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. అయినా వాళ్లు ఎప్పుడూ నన్ను ఆపలేదు. లోన్ తీసుకుని మరీ నన్ను కార్యక్రమాలకు పంపేవారు. ఆర్థిక ఇబ్బందులు ఎలా ఉంటాయో నేను దగ్గర నుంచి చూశాను. ఆ బాధ నాకు తెలుసు. అమ్మానాన్న నన్ను అంత కష్టపడి పెంచారు. వాళ్లకు కూడా నేన ఏదోఒకటి చేయాలి అనే ఇండస్ట్రీకి వచ్చాను" అని చెప్పారు.

**పెద్ద ప్రాజెక్ట్‌లు మిస్ అయ్యా..**

తన కెరీర్‌లో చాలా పెద్ద ప్రాజెక్ట్‌లు మిస్ అయినట్లు అనంతిక చెప్పారు. "ఫొటో పంపమంటారు. చిన్న పిల్లలా ఉన్నానని రిజెక్ట్ చేసేవారు. లుక్స్ కారణంగా నాని 'ది ప్యారడైజ్' అవకాశం పోయింది . మిస్ అయినందుకు బాధ ఉన్నా.. ఏం జరిగినా ముందుకు సాగాలనే మనస్తత్వం నాది. నాని అంటే నాకు చాలా ఇష్టం. 'రోమాంచకం' హిట్ అవుతుందని నాకు నమ్మకం ఉంది. మనకు రాసి ఉన్నది ఎప్పటికైనా మనకు వస్తుందని నమ్ముతాను" అని అనంతిక పంచుకున్నారు.

# విభిన్న కోణాలున్న పాత్ర శూర్పణఖ!



రామాయణ స్క్రిప్ట్ తనకు శూర్పణఖలోని కొత్త కోణాలను అన్వేషించడంలో సహాయపడిందని అంటోంది కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్. ఇప్పుడామె నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రామాయణ: పార్ట్ 1' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆమె రావణుడి సోదరి అయిన శూర్పణఖ పాత్రలో కనిపించనుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ ఈ సినిమాలోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

"శూర్పణఖ జీవితంలోని ఇంతకుముందు తెలియని కొన్ని కోణాలు ఈ పాత్ర చేయటం ద్వారా తెలుసుకున్నాను. ఆమె గురించి నాకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. నేను ఈ స్క్రిప్ట్ చదివినప్పుడు, లక్ష్మణుడు ఆమె ముక్కును కోసిన సంఘటన కంటే ముందు, ఆ తర్వాత ఆమె జీవితం గురించి చాలా విషయాలు అందులో ఉన్నాయి. నేను ఈ పాత్ర చేయడం ద్వారా నాకు ఇవన్నీ ఆసక్తిగా అనిపించాయి. అందుకే నాకు ఈ పాత్ర చాలా బాగా నచ్చింది. శూర్పణఖ వ్యక్తిత్వంలోని విభిన్న కోణాలకు నేను ఆకర్షితురాలినయ్యాను. లంకలో ఆమెను అత్యంత అందమైన మహిళ అని అనేవారు. ఆమెకు అహం ఉండేది. చరిత్ర తరచుగా ఆమెను ఒక భయంకరమైన ప్రతినాయకురాలిగా మాత్రమే గుర్తుంచుకున్నప్పటికీ శూర్పణఖలోని సహజసిద్ధమైన సంక్లిష్టతే నేను ఈ పాత్రను పోషించేలా చేసింద"ంటూ చెప్పుకొచ్చింది.

# దుల్కర్, నివిన్ మరోసారి మల్టీస్టారర్



కుటుంబ నేపథ్యం, ప్రేమకథా చిత్రాలతో సినీప్రియుల్ని అలరిస్తుంటారు మలయాళ కథానాయకుడు నివిన్ పౌలీ. గతంలో 'సర్వం మాయ' చిత్రంలో సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన యువకుడి పాత్రలో నటించి ప్రేక్షకుల హృదయాల్ని గెలుచుకున్నారు. ప్రస్తుతం ఇటీవలే విడుదలైన 'బెత్లెహం కుడుంబ యూనిట్' చిత్రంలో మమితా బైజుతో కలిసి ప్రేమప్రయాణం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హీరో నివిన్ తదుపరి చిత్రం దుల్కర్ సల్మాన్‌తో కలిసి చేయనున్నట్లు ఓ ఇంటర్వ్యూలో అధికారికంగా వెల్లడించారు. "దుల్కర్, నేను కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నాం. మా ఇద్దరికీ నచ్చే ఒక స్క్రిప్ట్, దాన్ని సుముఖంగా తీర్చిదిద్దే ఒక దర్శకుడు కావాలి. ఆగస్టు 21న 'బెత్లెహం కుడుంబ యూనిట్' చిత్రం విడుదలైన తర్వాత దుల్కర్ నన్ను అభినందించార"ని తెలిపారు. దుల్కర్, నివిన్ కాంబినేషన్‌లో 'విక్రమాదిత్యన్', 'బెంగళూర్ డేస్' చిత్రాలొచ్చాయి. మరోసారి వీరిద్దరి కలిసి ప్రేక్షకుల్ని ఎలా మెప్పించనున్నారో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# ఫోర్బ్స్ కవర్ పేజీపై అల్లు అర్జున్



ప్రముఖ కథానాయకుడు అల్లు అర్జున్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఫోర్బ్స్ ఇండియా మ్యాగజైన్ 'షో స్టాపర్స్ - 2026' పేరుతో విడుదల చేసిన సంచిక ముఖచిత్రంపై అల్లు అర్జున్ మెరిశారు. భారతదేశంలో అత్యంత ప్రభావం చూపుతున్న వంద మంది ప్రముఖులు, వాళ్లకున్న ఆదరణ, బ్రాండ్ విలువ, ఇతర విశేషాలతో ఈ మ్యాగజైన్‌ని తీసుకొచ్చింది ఫోర్బ్స్ ఇండియా. 'పుష్ప' సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో సత్తాని చాటిన అల్లు అర్జున్ వివిధ రంగాలకు చెందిన వంద మంది ప్రముఖుల్లో అగ్ర స్థానంలో నిలుస్తూ షో స్టాపర్స్ - 2026 కవర్ పేజీపై మెరిశారు. ఏటా ఇలా ప్రభావం చూపుతున్న వంద మంది ప్రముఖుల్ని ఒక వేదికపైకి తీసుకొస్తోంది ఫోర్బ్స్ ఇండియా సంస్థ.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ,** RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**